సాక్షి నిజామాబాద్

గురువారం । 5 । సెప్టెంబర్ । 2024



చెరువును తలపిస్తున్న స్కూల్

సిరికొండలోని మోడల్ స్కూల్ నుంచి వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక పాఠశాల ఆవరణ చెరువును తలపిస్తోంది.

- 8లో ▸



పంటలు కాపాడేందుకు కృషి

భారీ వర్షాలతో నీట మునిగిన పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
29.6 /22.1

వాతావరణం

చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

2,608 ఎకరాల్లో పంటనష్టం



డొంకేశ్వర్: జిల్లాలో భారీ వర్షాల కారణంగా పంటనష్టం 2,608 ఎకరాలకు చేరింది. మంగళవారం వరకు సిరికొండ, బోధన్ మండలాల్లోనే 1,426 ఎకరాల్లో పంటనష్టం జరుగగా, బుధవారం రెంజల్, వేల్పూర్ మండలాలు కలిపి మరో 1,182 ఎ కరాలు పెరిగింది. పంటల్లోకి వరద నీరు చేరడంతో నష్టం ఎక్కువగా జరిగింది. అత్య ధికంగా సోయాకే ఎక్కువ నష్టం వాటిల్లింది. వ్యవసాయ శాఖ ఇప్పటి వరకు సేకరించిన పంటనష్టం వివరాలు చూస్తే... వరి 539 ఎకరాలు, మొక్కజొన్న 25 ఎకరాలు, సోయా 2,012 ఎకరాలు, పత్తి 22 ఎకరాలు, మినుములు 10 ఎకరాల్లో దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న పంటలను వ్యవసాయాధికారులు పరిశీలించి వివరాలు నమోదు చేస్తున్నారు. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని పంటలు నష్టపోయిన రైతులు కోరుతున్నారు.

ఎక్సైజ్ ఎస్సై సస్పెన్షన్

పెర్కిట్(ఆర్మూర్): నిర్మల్ జిల్లాలో బిట్ కాయిన్ కేసులో ఇటీవల అరెస్టయిన ఆర్మూర్ ఎక్సైజ్ ఎస్సై గంగాధర్ సస్పెన్షన్‌కు గురయినట్లు ఆర్మూర్ సీఐ స్టీవెన్‌సన్ బుధవారం తెలిపారు. ఈ మేరకు వరంగల్ ఎక్సైజ్ శాఖ నోడల్ డిప్యూటీ కమిషనర్ అంజన్న ఉత్తర్వులు జారీ చేసినట్లు సీఐ వెల్లడించారు.

వరద బాధితులకు ఉద్యోగుల విరాళం



నిజామాబాద్‌అర్బన్: వరద బాధితుల కోసం జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయుల ఒకరోజు మూలవేతనాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళం ఇస్తామని ఎంప్లాయీస్ జేఏసీ జిల్లా చైర్మన్ అలుక కిషన్ తెలిపారు. ఉద్యోగుల తరఫున సుమారు రూ.5 కోట్లు అందిస్తామని పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీని జేఏసీ నాయకులు కలిసి విరాళం ఇస్తామని తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బిల్లులు, సమస్యలపై చర్చించినట్లు అలుక కిషన్ తెలిపారు. టీఎస్‌జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అమృత్ కుమార్, హనుమంత్‌రెడ్డి, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, రెవెన్యూ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రమణరెడ్డి, ప్రశాంత్ పాల్గొన్నారు.

జిల్లాలో 62.1 మి.మీ. వర్షపాతం

నిజామాబాద్ అర్బన్: జిల్లాలో మంగళవారం రాత్రి 8 గంటల నుంచి బుధవారం ఉదయం 8 గంటల వరకు 62.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా డొంకేశ్వర్‌లో 162.3 మి.మీ. మోపాల్‌లో 141.2, ఇందల్వాయిలో 113.2, ఆలూరులో 121.5, వేల్పూర్‌లో 100.4, రెంజల్‌లో 90.8, నందిపేటలో 79.8, డిచ్‌పల్లిలో 101.6, మాక్లూర్‌లో 89.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లావ్యాప్తంగా 20 ఇళ్లు దెబ్బతిన్నాయి. నగరంలోని ఓ పాత ఇల్లు కూలిపోయింది.

ఉక్కుపాదం మోపేనా?



బోధన్ పట్టణంలోని చెక్కి చెరువులో నివాసాలు



భీమ్‌గల్ రాధం చెరువు భూమిలో వేసిన రోడ్డు

- జిల్లాలో యథేచ్ఛగా ఆక్రమణలు
- వాల్టా అమలు.. హైడ్రా లాంటి వ్యవస్థ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు
- ఆక్రమణలపై చర్యలకు ప్లాన్
- పక్కాగా అమలు చేయాలని కోరుతున్న ప్రజలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఆక్రమణల తొలగింపు కోసం హైడ్రా లాంటి వ్యవస్థ కోసం రాష్ట్రవ్యాప్తంగా డిమాండ్లు వస్తున్నాయి. తాజాగా వచ్చిన వరదలతో ఆక్రమణల తొలగింపు విషయమై ప్రభుత్వం మరింత సీరియస్‌గా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ క్రమంలో అన్ని జిల్లాల్లో కలెక్టర్లు ఆక్రమణల తొలగింపు కోసం ప్లాన్ ఆఫ్ యాక్షన్ తయారు చేసుకుని ముందుకు కదలాలని ప్రభుత్వం సూచించింది. ప్రభుత్వ భూములు, నాలాలు, కాలువలు, చెరువులు, కుంటలు, పార్కులు ఆక్రమిస్తే తొలగించాలని, ప్రత్యేకంగా న్యాయవాదులను సైతం ఏర్పాటు చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఇదిలా ఉండగా ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో సైతం సహజ వనరులు జాగ్రత్తగా వాడుకునే విషయమై వాల్టా చట్టం ఉన్నప్పటికీ అది సక్రమంగా అమలు కావడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో దీన్ని పక్కాగా అమలు చేయడంతో పాటు నాలా(నాన్ అగ్రికల్చర్ ల్యాండ్) కన్వర్షన్ విషయంలో సైతం పకడ్బందీగా వ్యవహరించే విధంగా, పట్టణాల్లో సైతం హైడ్రా మాదిరిగా ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వం కలెక్టర్లకు సూచించినట్లు సమాచారం. ఈ క్రమంలో ఆక్రమణలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపేనా అని జిల్లా ప్రజలు చర్చించుకుంటున్నారు.

■ నిజామాబాద్ నగరంలో పూలాంగ్ వాగు అడుగడుగునా కబ్జా అయింది. మాలపల్లి నుంచి ప్రారంభమయ్యే డి 54 కెనాల్ చంద్రశేఖర్‌కాలనీ వరకు కబ్జా అయింది. అక్రమంగా నిర్మాణాలు చేపట్టడంతో ప్రస్తుతం వరద నీరు వెళ్లే పరిస్థితి లేదు. అర్సపల్లిలోని రామర్తి చెరువు 90 శాతం కబ్జా అయింది. నిత్యం రద్దీగా ఉండే ఖలీల్‌వాడి ప్రాంతంలో డ్రెయినేజీలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. ధర్మపురిహిల్స్, డ్రైవర్స్ కాలనీ, పెయింటర్స్ కాలనీల్లో 40 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా అయింది. గతంలో కలెక్టర్ నారాయణరెడ్డి పరిశీలించి ప్రభుత్వ భూమి సరిహద్దును నిర్దేశించారు. అక్రమ కట్టడాలను తొలగించారు. అయితే మళ్లీ కట్టడాలు చేయడం గమనార్హం.



నగరంలోని ఖిల్లా ప్రాంతంలో డీ 54 కెనాల్‌ను ఆక్రమించి చేపట్టిన నిర్మాణలు

మాక్లూర్ మండలంలోని దాస్‌నగర్ వద్ద ఉన్న నిజాంసాగర్ ప్రధాన కాలువ 68వ డిస్ట్రిబ్యూటరీ ద్వారా గతంలో ఆ ప్రాంత రైతులు సుమారు వెయ్యి ఎకరాల్లో పంటలు సాగు చేసేవారు. ప్రస్తుతం అక్కడ వెంచర్లు వెలిశాయి. దీంతో సాగునీటి అవసరం లేకపోవడంతో కాలువలు కబ్జా అయ్యాయి. 63వ జాతీయ రహదారి పక్కన సుమారు 3 కిలోమీటర్ల పొడువునా (దాస్‌నగర్ నుంచి సుఖ్‌జిత్ ఫ్యాక్టరీ పూలాంగ్ వాగు వరకు) కాలువ పూర్తిగా కబ్జాకు గురైంది. కాలువను కబ్జా చేసి ప్రహరీలు, బిల్డింగ్‌లు నిర్మించారు. ఫలితంగా చిన్న వర్షం కురిస్తే చాలు నీరు వెళ్లే మార్గం లేక జాతీయ రహదారి జలమయం అవుతోంది. మరోవైపు ఈ కాలువ కబ్జాతో నీరు వెళ్లే మార్గం లేక జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో నిలుస్తోంది.



■ బోధన్ నియోజకవర్గంలోని రెంజల్ మండలంలో రెంజల్ మైలారంకుంట, కూనేపల్లిలో మొఘల్‌పుర చెరువు, కళ్యాపూర్ గ్రామంలోని పెద్ద చెరువు, నీలా గ్రామంలోని పలు కుంటలు ఆక్రమణకు గురయ్యాయి. రెంజల్ పెద్ద చెరువుతో పాటు బోర్గం గ్రామంలోని చెరువు, నీలా గ్రామంలోని పలు కుంటల్లో తవ్వకాలు జరపడంతో ప్రమాదకరంగా మారాయి. నవీపేటలోని దర్యాపూర్ చెరువు 30 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా ఇందులో 5 ఎకరాల వరకు రియల్ స్టేట్ వ్యాపారులు ఆక్రమించారు. నవీపేట మండలం మోకన్‌పల్లి చెరువులో 60 ఎకరాల శిఖం భూమిని కొందరు పట్టా చేసుకున్నారని గ్రామస్తులు గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

■ బాల్కొండ నియోజకవర్గంలోని భీమ్‌గల్ రాధం చెరువు భూములు ఎన్నో ఏళ్లుగా కబ్జాదారుల చేతుల్లో ఉన్నాయి. బాల్కొండలోని హైదర్‌కుంట అక్రమణకు గురి కాగా రైతుల భాగస్వామ్యంతో కబ్జాదారుల నుంచి విముక్తి కలిగించారు. మోర్తాడ్‌లోని ముత్తెమ్మ చెరువు శిఖం కబ్జా అయింది.

■ ఇందల్వాయి చెరువు విస్తీర్ణం 480 ఎకరాలు కాగా 80 ఎకరాలు కబ్జా అయింది. గన్నారం చెరువు సైతం సుమారు 15 ఎకరాలు ఆక్రమణకు గురైంది.

■ ఆర్మూర్‌లో నిజాంసాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన 82/2 సబ్ డిస్ట్రిబ్యూటరీ కాలువకు గల 82/2/1 మైనర్ కాలువ ఆక్రమణలకు గురవుతోంది. 70 ఫీట్ల వెడల్పు, 3.9 కిలో మీటర్ల పొడవు ఉండి ఆర్మూర్ పట్టణంలోని మామిడిపల్లి, పెర్కిట్-కొటార్మూర్ మీదుగా వెళ్లే ఈ కాలువ ఆక్రమణల కారణంగా తన ఉనికిని కోల్పోయింది. నందిపేటలోని రఘునాథ చెరువు కబ్జా చేసి నిర్మాణాలు చేశారు. మాక్లూర్ మండలంలోని చిక్లి పెద్ద చెరువు, మాణిక్ భండార్ శివారులోని నిజాంసాగర్ ప్రధాన కాలువ, చిన్నాపూర్ గ్రామ శివారులోని చెరువు శిఖం భూమి, అడవి మామిడిపల్లిలోని చెరువు అలుగు ప్రాంతం కబ్జా అయ్యాయి.



ఎల్లమ్మగుట్ట వద్ద పూలాంగ్ వాగును ఆక్రమించి నిర్మించిన కట్టడాలు

ఫిర్యాదు చేశాం

దాస్‌నగర్ వద్ద 68వ డిస్ట్రిబ్యూటరీ కాలువ కబ్జా విషయమై అధి కారులకు అనేక సా ర్లు ఫిర్యాదు చేశాం. సర్వేలు చేశారు. హద్దులు కూడా పాతారు. కానీ అక్రమ నిర్మాణాలు, కబ్జాలను మాత్రం తొలగించలేదు. ఈ కబ్జాల కారణంగా వర్షాకాలంలో అనేక ఇబ్బందులు పడుతున్నాం. దాస్‌నగర్ నుంచి మాణిక్ భండార్ చౌరస్తా వరకు ఉన్న కబ్జాలను తొలగించాలి.

– గుగ్గిలం రాజేశ్వర్‌గౌడ్, మాజీ సర్పంచ్, బోర్గాం(కె)

సర్వే చేయాలని కోరాం

నిజాంసాగర్ ప్రధాన కాల్వ 68వ డిస్ట్రిబ్యూటరీ ప్రధాన కాలువల కబ్జా విషయమై స్థానిక తహసీల్దార్‌కు సర్వే కోసం లెటర్ ఇచ్చాం. వారు సర్వే చేశారా, లేదా అనే విషయం తెలియదు. నేను రాక ముందు 2020లో ఒకసారి సర్వేచేసి హద్దులు పాతినట్లు సమాచారం ఉంది. కబ్జాదారులు ఆ సర్వేను బేఖాతరు చేసినట్లు తెలుస్తోంది. స్థానికుల ఫిర్యాదు మేరకు నేను సర్వే కోసం లేఖ రాశాను. 68వ డిస్ట్రిబ్యూటరీ ప్రధాన కాలువతో పాటు పిల్ల కాలువలు కబ్జా అయ్యాయి. మరోసారి తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్తా.

– దివ్యభారతి, మేజర్ ఇరిగేషన్ ఏఈ, మాక్లూర్

రాష్ట్రస్థాయి ఉత్తమ టీచర్లుగా ఎంపిక

నిజామాబాద్ అర్బన్: జిల్లాలోని పలువురు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, కాలేజీలు, యూనివర్సిటీ అధ్యాపకులకు రాష్ట్రస్థాయి అవార్డులు వరించాయి. జిల్లా కేంద్రంలోని దుబ్బా ప్రభుత్వ పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు సీహెచ్ ముద్దుకృష్ణ, ఆలూరు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు నరేందర్, ఎస్‌జీటీ విభాగంలో నగరంలో గద్వాల్ జీపీఎస్ ఉర్దూ మీడియం పాఠశాల ఉపాధ్యాయుడు ఎంఏ అలీం ఎంపికయ్యారు. అధ్యాపకుల విభాగంలో తెలంగాణ యూనివర్సిటీలో జియో ఇన్ఫర్మేషన్ డిపార్ట్‌మెంట్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ సుధాకర్ గౌడ్, గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ బాలమణి రాష్ట్రస్థాయి అవార్డులకు ఎంపికయ్యారు. భీమ్‌గల్ డిగ్రీ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ హెచ్ సతీష్, మోర్తాడ్ డిగ్రీ కాలేజీ కామర్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ పెద్దన్నలను అవార్డులు వరించాయి.

బోధనలో ఆదర్శం

నగరంలోని దుబ్బ హైస్కూల్‌లో ఫిజికల్ సైన్స్ టీచర్‌గా పని చేస్తున్న ముద్దుకృష్ణ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఆయన 2009లో ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించారు. ప్రయోగాత్మకంగా భౌతిక శాస్త్ర పాఠాలు బోధిస్తూ విద్యార్థులలో సృజనాత్మక శక్తిని పెంపొందింపజేస్తున్నారు. ఆయన విద్యార్థులెందరో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలలో సత్తా చాటారు. ఇన్నోవేటివ్ టీచర్స్ అనే సంస్థ ఆయనకు 2019లో 'ఇన్నోవేటివ్ టీచర్' పురస్కారాన్ని అందించింది. 2018లో దక్షిణ భారతదేశ స్థాయి జవహర్‌లాల్ నెహ్రూ నేషనల్ సైన్స్ అండ్ మ్యాథ్స్ ఎగ్జిబిషన్‌లో టీచర్ ఎక్సిబిట్ కేటగిరీలో ప్రథమ బహుమతి అందుకున్నారు. 2020 లో కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ సైంటిస్ట్ పోటీలో సిల్వర్ మెడల్ సాధించారు. ఆ కౌన్సిల్‌కు శాశ్వత సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో గుజరాత్‌లోని గాంధీనగర్‌లో నిర్వహించిన సెంటర్ ఫర్ క్రియేటివ్ లర్నింగ్ నేషనల్ లెవల్ ఫిజికల్ సైన్స్ టీచర్ ట్రెనింగ్ క్యాంపులో పాల్గొన్నారు. రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక కావడంపై ముద్దుకృష్ణ సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులలో సృజనాత్మక శక్తిని పొంపొందింపజేయాలన్న లక్ష్యంతో మరింత పట్టుదలతో పనిచేస్తానని పేర్కొన్నారు.



ఫిజిక్స్ ప్రయోగాన్ని వివరిస్తున్న ముద్దుకృష్ణ

విద్య అభ్యున్నతికి కృషి



ఎం నరేందర్

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ హెచ్‌ఎం మేస నరేందర్ రాష్ట్రస్థాయి ఉత్తమ ప్రధానోపాధ్యాయునిగా ఎంపికయ్యారు. నరేందర్ మానాల, కోనసముందర్, మచ్చర్ల, యానంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విధులు నిర్వహించి 2024లో ఆలూర్‌లో బాధ్యతలు చేపట్టారు. తాను విధులు నిర్వహించిన చోట పాఠశాల అభివృద్ధితో పాటు విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేశారు.

నగరంలో స్టేడియం.. సింథటిక్ ట్రాక్

- ఏర్పాటు చేయాలని సర్కార్ నిర్ణయం
- 'సాక్షి' కథనాలకు స్పందన

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఇందూరు నగరానికి స్టేడియం కావాలనే ప్రజలందరి ఆకాంక్ష నెరవేరే తరుణం వస్తోంది. నిజామాబాద్‌లో క్రీడా స్టేడియం, మైదానం, ఇండోర్ స్టేడియం, సింథటిక్ ట్రాక్ కావాలనే డిమాండ్లు ఏళ్ల తరబడిగా ఉన్నాయి. ఇందుకోసం పలువురు తమవంతుగా పోరాటాలు చేస్తూ వస్తున్నారు. అయినప్పటికీ స్టేడియం కల నెరవేరలేదు. ఈ నేపథ్యంలో జూలై 27న 'ఇందూరుకు స్టేడియం కావలెను' అనే శీర్షికతో 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. అదే రోజు అన్ని రాజకీయ పక్షాలు, క్రీడా సంఘాలు, ఇతర సంఘాల బాధ్యులతో 'సాక్షి' ఆధ్వర్యంలో స్టేడియం ఆవశ్యకతపై పాత కలెక్టరేట్ గ్రౌండ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించడం జరిగింది. దీంతో స్పందించిన ప్రభుత్వం పాత కలెక్టరేట్ గ్రౌండ్‌లో చుట్టూ సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేసేందుకు నిర్ణయించింది. మధ్యలో ఫుట్‌బాల్ తదితర క్రీడలు ఆడేందుకు వీలుగా నిర్మాణాలు చేయనున్నారు. అదేవిధంగా దీని పక్కనే డ్వాక్రా బజార్ స్థలంలో ఇండోర్ స్టేడియం నిర్మాణం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా గురువారం ఆయా మైదానాల వద్ద నిపుణులతో కొలతలు తీసుకునేందుకు, ఇతర అంశాలు పరిశీలించేందుకు ప్రభుత్వ పెద్దలు రానున్నారు.


నిండుకుండలా నిజాంసాగర్

- నాలుగు రోజుల్లోనే నిండిన ప్రాజెక్టు
- ఒక గేటు ద్వారా నీటి విడుదల

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వరప్రదాయినిగా పేరున్న నిజాంసాగర్ ప్రాజెక్టు నాలుగు రోజుల్లో నిండుకుండలా మారింది. నిజాంసాగర్ ప్రాజెక్టులో వర్షాకాలం ప్రారంభంలో మూడు టీఎంసీల నీరు మాత్రమే ఉంది. అడపాదడపా కురిసిన వర్షాలతో నాలుగు రోజుల క్రితం వరకు 1.9 టీఎంసీల నీరు వచ్చి చేరింది. ఉన్న కాస్త నీటిలోంచే ఖరీఫ్ పంటల సాగు కోసం విడుదల చేశారు. సరైన వర్షాలు లేకపోవడంతో పంటలు ఎలా గట్టెక్కుతాయోనని ఆందోళన చెందుతున్న అన్నదాతలకు తుపాన్ ఊరటనిచ్చింది. నాలుగు రోజులనుంచి కురుస్తున్న వర్షాలతో నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువనుంచి భారీగా వరద నీరు వచ్చి చేరింది. దీంతో నాలుగు రోజుల్లోనే ప్రాజెక్టు నిండుకుండలా మారింది.

1.25 లక్షల ఎకరాలకు సాగునీరు..

నిజాంసాగర్ ప్రాజెక్టు ద్వారా కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలలోని 1.25 లక్షల ఎకరాలకు సాగునీరందనుంది. ప్రాజెక్టు నిండుకుండలా మారడంతో ప్రస్తుత వానాకాలం సీజన్‌తో పాటు వచ్చే యాసంగి సీజన్‌కు ఢోకా ఉండదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పోచారం ప్రాజెక్టు నిండి పొంగి పొర్లడం, మెదక్ జిల్లాలో హల్దీవాగు నుంచి వరద రావడం అలాగే ఘణపురం ఆనకట్ట నుంచి కూడా వరద రావడంతో నిజాంసాగర్ ప్రాజెక్టు నాలుగు రోజుల్లో నిండింది. ప్రాజెక్టు నిండడంతో రెండు పంటలకు పూర్తి స్థాయిలో నీరు అందుతుందని నీటి పారుదల శాఖ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్ 'సాక్షి'తో పేర్కొన్నారు.



ప్రాజెక్టు వరద గేటు ద్వారా విడుదలవుతున్న నీరు

సాగర్‌లోకి 29,700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు నిజాంసాగర్ ప్రాజెక్టులోకి బుధవారం రాత్రి ఏడు గంటల ప్రాంతంలో 29,700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 1,405 అడుగులు(17.802 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 1,403.82 అడుగుల(16.109 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో కొనసాగుతుండడంతో ప్రాజెక్టు ఆరో వరద గేటు ఎత్తి 2 వేల క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి విడుదల చేస్తున్నారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా బందోబస్తు : సీపీ కల్మేశ్వర్

నిజామాబాద్ అర్బన్: ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి, మిలాద్–ఉన్–నబీ వేడుకలు జరుపుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. ఈ పండుగలను పురస్కరించుకుని కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం కలెక్టర్, సీపీ కల్మేశ్వర్ సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం జరిపి కీలక సూచనలు చేశారు. ఆయా పండుగల నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలు, కల్పించాల్సిన సౌకర్యాల కోసం సార్వజనిక్ గణేశ్ మండలి ప్రతినిధులు, శాంతి కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలు, మండపాల నిర్వాహకులు పలు ప్రతిపాదనలు చేస్తూ తమ అభిప్రాయాలను వెల్లడించారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ ఉత్సవాల నిర్వహణకు జిల్లా యంత్రాంగం తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. వినాయక నిమజ్జనం, మిలాద్–ఉన్–నబీ వేడుక ఒకేసారి వస్తున్నందున భద్రతాపరమైన చర్యలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. ఏకధాటిగా వర్షాలు కురుస్తున్నందున మండపాల ఏర్పాటులో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండపాలకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ సరఫరా చేయనున్నందున మంటపాల వివరాలను ట్రాన్స్‌కో అధికారులు అందించి విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. సీపీ కల్మేశ్వర్ మాట్లాడుతూ.. సమస్యాత్మక ప్రాంతాలు, ప్రార్థనాలయాల వద్ద నిజామాబాద్ నగరంలోనే ఈసారి సుమారు 750 పైచిలుకు సీసీ కెమెరాలు నెలకొల్పుతున్నామని తెలిపారు. నిర్వాహకులు కూడా మండపాల వద్ద సీసీ కెమెరా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మంటపాల వద్ద నిర్వాహకులు రాత్రివేళల్లో తప్పనిసరిగా ఉండాలని సూచించారు. సామాజిక మాధ్యమాలలో చేసే పోస్టింగ్‌లపై ప్రత్యేక నిఘా ఉంచుతామని, ప్రశాంతతకు భంగం కలిగిస్తూ అల్లర్లు సష్టించేందుకు యత్నించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. వేడుకలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎం మకరందు, ట్రెయినీ కలెక్టర్ సంకేత్ కుమార్, డిప్యూటీ మేయర్ ఇద్రీస్, అదనపు డీసీపీలు కోటేశ్వర్ రావు, బస్వారెడ్డి, ఆర్డీవోలు అంబదాస్ రాజేశ్వర్, రాజాగౌడ్, నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు, పక్కన సీపీ కల్మేశ్వర్

క్లుప్తంగా

ఆర్బీఐ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు



నిజామాబాద్‌అర్బన్: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రారంభమై 90 ఏళ్ల గడిచిన సందర్భంగా జిల్లాలోని డిగ్రీ విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు బ్యాంక్ అధికారులు బుధవారం పేర్కొన్నారు. పోటీలకు సంబంధించిన పోస్టర్లను జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఆవిష్కరించారు. పోటీలు రాష్ట్ర, జోనల్, జాతీయ స్థాయిల్లో ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి రూ. రెండు లక్షలు, ద్వితీయ రూ. 1.5 లక్షలు తృతీయ బహుమతి రూ. లక్ష, జోనల్ స్థాయిలో ప్రథమ బహుమతి రూ.5 లక్షలు, ద్వితీయ రూ.4 లక్షలు, తృతీయ రూ. 3 లక్షలు, జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి రూ. 10 లక్షలు, ద్వితీయ రూ. 8లక్షలు, తృతీయ రూ. 6 లక్షల బహుమతి ఉంటుందని అన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు తమ కళాశాలలో ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

ఈ-పాస్ ద్వారానే ఎరువులు విక్రయించాలి



కమ్మర్‌పల్లి: ఫెర్టిలైజర్ షాపుల్లో రైతులకు ఈ-పాస్ మిషన్ ద్వారానే ఎరువులను విక్రయించాలని జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ పేర్కొన్నారు. మండలంలోని కోనాపూర్‌లోని ఫెర్టిలైజర్ దుకాణాలను బుధవారం తనిఖీ చేశారు. ఎరువుల విక్రయాలకు సంబంధించి రికార్డులు, స్టాక్ పొజిషన్‌ను పరిశీలించారు. ఆయన వెంట ఏవో రమ్యశ్రీ, ఏఈవో సాయిరాం ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్: గురుకుల బాలికల పాఠశాల నవీపేటలో స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పద్మకుమారి బుధవారం తెలిపారు. ఎంపీసీలో 13, బైపీసీలో నాలుగు సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన విద్యార్థులు ఈనెల 5, 6వ తేదీల్లో కళాశాలకు హాజరై అడ్మిషన్ పొందాలన్నారు.

పంటలను కాపాడేందుకు కృషి చేస్తాం



హంగర్గ శివారులో పంటలను పరిశీలించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



కందకుర్తిలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి
- ఎస్సారెస్పీ అవుట్ ఫ్లో పెంచాలని అధికారులకు సూచన

బోధన్: భారీ వర్షాలతో నీట మునిగిన పంటలను కాపాడేందుకు కృషి చేస్తున్నట్లు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. బోధన్ మండలంలోని ఎస్సారెస్పీ వరద ముంపు ప్రాంతం హంగర్గ శివారులో ప్రాజెక్టు వరద నీట మునిగి పంటలను బుధవారం పరిశీలించారు. రైతులు, అధికారులతో మాట్లాడారు. గోదావరి నదికి దిగువ ప్రాంతంలో ఉన్న ఎస్సారెస్పీకి రెండు, మూడు రోజులుగా భారీ వరద చేరుతోందన్నారు. ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ఉధృతితో నియోజకవర్గ పరిధిలో ఉన్న బోధన్, రెంజల్, నవీపేట మండలాల్లోని పలు గ్రామాల్లో రైతులు సాగు చేసిన వేలాది ఎకరాల్లో సోయా, పత్తి, వరి పంటలు నీట మునిగి నష్టం వాటిల్లుతోందని అన్నారు. అవుట్‌ఫ్లో పెంచడమే నీట మునిగిన పంటల రక్షణకు ఏకైక మార్గమని చెప్పారు. బోధన్ మండలంలోని హంగర్గ శివారులోనే 750 ఎకరాలు, బిక్నెల్లి గ్రామ శివారులో 200 ఎకరాకులపైగా సోయా పంట నీట మునిగి నష్టం వాటిల్లుతోందన్నారు. ఈ పరిస్థితిని రాష్ట్ర ఇరిగేషన్ శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. వరదతో నీట మునిగి నష్టం వాటిల్లిన పంటల వివరాలను సర్వే చేసి నివేదికలు ప్రభుత్వానికి అందించాలని వ్యవసాయ, రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

అలీసాగర్ రిజర్వాయర్, మంజీర నది సందర్శన

ఎడపల్లి మండలంలోని ఠానాకలాన్ శివారులో ఉన్న అలీసాగర్ రిజర్వాయర్‌ను ఎమ్మెల్యే సందర్శించారు. దిగువ ప్రాంతంలో సాగు చేసిన వరి పంట రిజర్వాయర్ వరద నీటి విడుదలతో నీట మునిగి నష్టం జరుగుతోందని పలు గ్రామాల రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయం ఇరిగేషన్ శాఖ అధికారులతో మాట్లాడి ఒక గేట్ ద్వారా నీటి విడుదల చేపట్టాలని సూచించారు. అలీసాగర్ రిజర్వాయర్ నుంచి వరద నీరు వృథా కాకుండా మాటు కాలువ ద్వారా కుర్నాపల్లి, మంగల్‌పాడ్ పాడ్, ఠానాకలాన్, ఎడపల్లి గ్రామాల చెరువులను నింపుకొనేందుకు పరిస్థితిని పరిశీలించాలని ఇరిగేషన్ శాఖ అధికారులకు ఆదేశించినట్లు తెలిపారు. సాలూర మండల కేంద్రం శివారులోని మంజీర నదిని ఎమ్మెల్యే సందర్శించారు. ఎగువ ప్రాంతంలోని నిజాంసాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదిలితే మంజీరలో వరద ఉధృతి మరింత పెరుగుతుందని, ఈ ప్రాంత రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, ఇరిగేషన్ శాఖ ఎస్ఈ భద్రి నారాయణ, ఈఈ సయ్యద్ మహ్మద్ జానీ, డీఈ లోక్యనాయక్, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, నాయకులు బిల్లా రాంమోహన్, పులి శ్రీనివాస్, పాషా మొహినొద్దీన్, నాగేశ్వర్ రావు, తహసీల్దార్ విఠల్, ఏవో సంతోష్‌కుమార్, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

కందకుర్తిలో..

రెంజల్: మండలంలోని కందకుర్తి గోదావరి వద్ద వరదకు నీట మునిగిన పంటలను ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. వరదల సమయంలో జిల్లా రైతుల పంట భూములే ఎక్కువ శాతం నీట మునుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు ప్రాజెక్టులో నీటి నిల్వలను తగ్గించి సకాలంలో దిగువకు వదిలితే పంటలు నీట మునిగే ప్రమాదం తగ్గుతుందన్నారు. వ్యవసాయాధికారులు నీట మునిగిన పంటల వివరాలను సేకరించాలని జిల్లా వ్యవసాయాధికారి వాజీద్‌హుస్సేన్‌కు సూచించారు. నాయకులు మొబిన్‌ఖాన్, సాయారెడ్డి, ఖలీంబేగ్, సాయిబాబాగౌడ్, జావీద్, పోచయ్య, నితిన్, అనిల్, సాయాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువును తలపిస్తున్న స్కూల్



సిరికొండలోని మోడల్ స్కూల్ ఎదుట నిలిచిన వర్షపు నీరు



చెరువును తలపిస్తున్న మోడల్ స్కూల్ ఆవరణ

సిరికొండ: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ చెరువును తలపిస్తోంది. వర్షపునీరు బయటికి వెళ్లడానికి వ్యవస్థ లేకపోవడంతో నీరంతా పాఠశాల ఆవరణలోనే నిలిచిపోతోంది. మోడల్ స్కూల్ పక్కనే ఉన్న బాలికల వసతి గృహం ఆవరణలోనూ నీరు నిలుస్తోంది. పాఠశాలను తాళ్లకుంటలో నిర్మించారని, అందువల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. వరద నీటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

శ్రీరాంసాగర్‌కు భారీ వరద

- 41 గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల



వరద గేట్ల ద్వారా దిగువకు వదులుతున్న నీరు

బాల్కొండ: జిల్లాలోకి శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద పోటెత్తుతోంది. బుధవారం ప్రాజెక్ట్‌లోకి 2.75లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండడంతో అంతే నీటిని 41 గేట్ల ద్వారా గోదావరిలోకి వదులుతున్నారు. మంగళవారం ప్రాజెక్ట్‌లోకి 2.5 లక్షల క్యూసెక్కుల నీటిని వదిలిన అధికారులు బుధవారం ఉదయం ప్రాజెక్ట్‌లో నీటి మట్టాన్ని పెంచడం కోసం 1.5 లక్షల క్యూసెక్కులకు తగ్గించి నీటి విడుదల కొనసాగించారు.

ఉదయం 9 గంటల తర్వాత మళ్లీ ప్రాజెక్ట్‌లోకి వరద ఉధృతి పెరగడంతో ప్రాజెక్ట్ నుంచి 41 వరద గేట్ల ద్వారా 2 లక్షల క్యూసెక్కులకు పెంచారు. మధ్యాహ్నం ప్రాజెక్ట్‌లోకి 3లక్షల5వేల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్ట్ నుంచి 3 లక్షల క్యూసెక్కులకు పెంచి గోదావరిలోకి వదలడం ప్రారంభించారు. రాత్రికి 3.55 లక్షల క్యూసెక్కులకు పెంచారు. ఎస్సారెస్పీలోకి మరింత వరద పెరిగే అవకాశం ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

పెరిగిన ఎస్సారెస్పీ నీటి నిల్వ..

ఎస్సారెస్పీలోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు 2 లక్షల క్యూసెక్కులకు ఇన్‌ఫ్లో పడిపోవడంతో ప్రాజెక్ట్ అధికారులు నీటి నిల్వ పెంపుపై దష్టి సారించారు. క్రితం రోజు 3 టీఎంసీల నీటి నిల్వను తగ్గించి 69 టీఎంసీలకు తీసుకెళ్లారు. తర్వాత నీటి విడుదలను పెంచడం ప్రారంభించారు. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 73.74 టీఎంసీలకు చేరింది.

కొనసాగుతున్న నీటి విడుదల

ప్రాజెక్ట్ నుంచి కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. వరద కాలువ ద్వారా 19 వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 4 వేలు, ఎస్కేప్ గేట్ల ద్వారా 4 వేలు, ఆవిరి రూపంలో 651 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా బుధవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1089.10(73.74 టీఎంసీలు) అడుగుల నీరు ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.

పెరిగిన విద్యుదుత్పత్తి

ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ, ఎస్కేప్ గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతుండటంతో జల విద్యుదుత్పత్తి కొనసాగుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టు నిండుకుండలా ఉండటం, నీటి ప్రవాహం సైతం వేగంగా ఉండటంతో సామర్థ్యానికి మించి విద్యుదుత్పత్తి జరుగుతోంది. ప్రస్తుతం నాలుగు టర్బయిన్ల ద్వారా 36.10 మెగావాట్ల విద్యుతుత్పత్తి జరుగుతోందని జెన్‌కో డీఈఈ శ్రీనివాస్ పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా సుధాకర్‌గౌడ్



డాక్టర్ సుధాకర్‌గౌడ్

భిక్కనూరు: తెలంగాణ యునివర్సిటీ సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్, జియో ఇన్ఫర్మేటిక్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సుధాకర్‌గౌడ్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేసింది. ఆర్మూర్ నియోజకవర్గంలోని మునిపల్లిలో జన్మించిన సుధాకర్‌గౌడ్ ఉపాధ్యాయ వృత్తిలో అంచెలంచెలుగా ఎదిగారు. నిజామాబాద్‌లో పాఠశాల, ఇంటర్ విద్యను అభ్యసించి నిజాం కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎంఎస్సీ పూర్తిచేసి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. 2009లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఎంపికయ్యారు. అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తూనే సౌత్‌క్యాంపస్ ప్రిన్సిపాల్‌గా పరిపాలన బాధ్యతలు చూస్తున్నారు. విద్యారంగంలో ఇంటర్మీడియెట్ తెలుగు అకాడమీ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో పుస్తక రచయితగా ఉన్నారు. సుధాకర్‌గౌడ్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం హర్షణీయమని తెలంగాణ యునివర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరి అన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

ఇద్దరు సీఐల బదిలీ

ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఇద్దరు సీఐలను బదిలీ చేస్తూ సీపీ కల్మేశ్వర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ట్రాఫిక్ సీఐగా ఉన్న వెంకటనారాయణను బోధన్ ఎస్‌హెచ్‌వోగా బదిలీ చేయగా అక్కడ పని చేస్తున్న ఎస్‌హెచ్‌వో వీరయ్యను ట్రాఫిక్ సీఐగా బదిలీ చేశారు.

అర్ధరాత్రి కుండపోత

- డొంకేశ్వర్‌లో 16 సెంటీ మీటర్ల వర్షపాతం



డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ మండలంలో వర్షం దంచికొట్టింది. మంగళవారం అర్ధరాత్రి ఒక్కసారిగా కుండపోత వర్షం కురిసింది. రికార్డు స్థాయిలో మండలంలో 16 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో తెల్లారేసరికి రోడ్లు జలమయం అయ్యాయి. చెరువులు నిండి అలుగులు పారాయి. పంట పొలాలు నీటమునిగాయి. తొండాకూర్, దత్తాపూర్, నికాల్‌పూర్, కోమట్‌పల్లి, డొంకేశ్వర్ గ్రామాల్లో తూములు, అలుగుల వరద నీటి ప్రవాహానికి వరిపంటకు కొంతమేర నష్టం జరిగింది. దత్తాపూర్ అలుగును ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పరిశీలించారు.

మూడోసారి జీజీహెచ్ టెండర్ వాయిదా

నిజామాబాద్‌నాగారం: ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి సంబంధించిన డైట్ టెండర్ మూడోసారి వాయిదా పడింది. కలెక్టర్ రాజీవ్‌గాంధీ చాంబర్‌లో మంగళవారం జరగాల్సిన టెండర్‌ను అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు జీజీహెచ్ ఏడీ రాజశేఖర్ తెలిపారు. టెండర్‌లో పాల్గొన్న కాంట్రాక్టర్లు ఇరువురు ఫిర్యాదులు చేసుకున్న విషయం తెలిసిందే. దీనిపై విచారణ చేపడుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కొంతమంది నకిలీ పత్రాలు పెట్టారని, టెండర్ ఒకరి పేరు మీద మరొకరు కొన్నేళ్లుగా అక్రమంగా కాంట్రాక్టు నిర్వహించారంటు ఫిర్యాదులు రావడంతో అధికారులు విచారణ చేపడుతున్నారు. మొదట టెండర్ దరఖాస్తులు స్వీకరించి టెండర్ ఓపెన్ చేయడానికి అధికారులు ఆలస్యం చేశారు. ఈ విషయమై 'సాక్షి'లో కథనాలు రావడంతో ఆగస్టు 23న టెండర్ ఓపెన్ చేశారు. టెండర్ ఫారాలు సక్రమంగా లేవని, క్షుణంగా పరిశీలించడానికి సమయం కావాలంటు మొదట వాయిదా వేసిన తెలిసిందే. మళ్లీ 26న టెండర్ ఓపెన్ చేశారు. అప్పటికే టెండర్ రద్దు చేయాలంటు దళిత సంఘాలు కలెక్టర్‌కు విన్నవించారు. పలువురు కాంట్రాక్టర్లు అక్రమాలకు పాల్పడ్డారని, నకిలీ పత్రాలు సమర్పించారంటు ఫిర్యాదు రావడంతో 11మందిలో ఆరుగురి దరఖాస్తులను తిరస్కరించారు. 5 మంది టెండర్‌లో ఉండగా ప్రక్రియ పూర్తవుతుందనుకుంటే మళ్లీ అనివార్య కారణలతో వాయిదా పడింది. దీనిపై రాజకీయ ఒత్తిడి ఉన్నట్లు సమాచారం. పూర్తిస్థాయిలో ఫిర్యాదులను విచారణ చేయడానికి ఆలస్యం అవుతుందంటున్నారు. జీజీహెచ్ చరిత్రలో ఓ టెండర్ మూడు సార్లు వాయిదా పడడం చర్చనీయంశంగా మారింది. త్వరలోనే టెండరు తేదీని ప్రకటిస్తామని ఏడీ పేర్కొన్నారు.

ఐసీడీఎస్‌లో పదోన్నతులు

నిజామాబాద్‌నాగారం: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న ఆయాలకు పదోన్నతులు లభించాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐదు ప్రాజెక్టు కార్యాలయాల పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఆయాలకు మెరిట్, సీనియారిటీ ప్రకారం సీడీపీవోలు పదోన్నతులు కల్పించారు. మంగళవారం ఇందుకు సంబంధించిన ఆర్డర్‌కాపీలను పదోన్నతులు పొందిన వారికి అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్ పోస్టులు ఖాళీగా ఉండి, ఆయాలు విధులు నిర్వహిస్తూ మెరిట్, సీనియారిటీ ప్రతిపాదికన మొత్తం 21మందికి పదోన్నతులు కల్పించిన్నట్లు జిల్లా అధికారి రసూల్‌బీ తెలిపారు.

ప్రాజెక్టుల వారీగా ఇలా	
భీమ్‌గల్	08
ఆర్మూర్	03
బోధన్	04
డిచ్‌పల్లి	02
నిజామాబాద్	04

క్రైం కార్నర్

వేర్వేరు ఘటనల్లో ముగ్గురు మృతి

బైక్‌పై నుంచి పడి యువకుడు..



ప్రవీణ్ మృతదేహం

పిట్లం: మండల శివారులోని జాతీయ రహదారిపై బైక్ అదుపు తప్పి కింద పడిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలైనట్లు ఎస్సై రాజు బుధవారం తెలిపారు. పిట్లంకు చెందిన ప్రవీణ్(18) తన మిత్రుడు కృష్ణతో కలిసి బైక్‌పై వేరే గ్రామానికి జాతీయ రహదారి గుండా వెళ్తుండగా అదుపు తప్పి కిందపడ్డారు. ఈ ఘటనలో ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందగా కృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. స్థానికులు చికిత్స నిమిత్తం క్షతగాత్రుడిని పిట్లం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చేపలు పట్టేందుకు వెళ్లి ఒకరు..



సైదాబోయి(ఫైల్)

బాన్సువాడ: బీర్కూర్ గ్రామానికి చెందిన సైదాబోయి(35) అనే వ్యక్తి చేపలు పట్టేందుకు వెళ్లి మృతి చెందినట్లు ఎస్సై నర్సింలు తెలిపారు. సైదాబోయి ఈ నెల 1న పీర్ల వాగులో చేపలు పట్టేందుకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. బుధవారం మధ్యాహ్నం పీర్ల వాగులో మృతదేహం ఉందన్న సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. మృతదేహం సైదాబోయిగా గుర్తించి కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మే రకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మద్యం మత్తులో మరొకరు..

ఖలీల్‌వాడి: మద్యం మత్తులో ఓ వ్యక్తి కిందపడి మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలోని బైపార్ రోడ్డులో ఉన్న ఎంకేఆర్ వైన్స్ పర్మిట్‌లో చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. మాణిక్‌బండార్‌కు చెందిన జంగం ప్రభాకర్(39) నగరంలోని ఎంకేఆర్ వైన్స్ పర్మిట్ రూంలో మంగళవారం రాత్రి మద్యం సేవిస్తున్నాడు. ఈ క్రమంలో మద్యం మత్తులో కిందపడడంతో గాయాలై మృతి చెందాడు. మృతుడి భార్య జంగం సురేఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ..

మోపాల్: కడుపునొప్పి భరించలేక పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ బుధవారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన తలారి ప్రవీణ్(31) ప్రైవేట్ జాబ్ చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలుపడంతో వారు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య స్వర్ణలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లుఎస్సై పేర్కొన్నారు.

వైన్ షాప్‌లో చోరీ

బాల్కొండ: మండలంలోని కిసాన్‌నగర్‌లో ఉన్న తుల్జా భవాని వైన్ షాప్‌లో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. బుధవారం ఉదయం వైన్ షాప్ తీసేందుకు వచ్చిన యజమానికి షటర్ తీసి ఉన్నట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. రూ. రెండు వేలు విలువ చేసే మద్యంతో పాటు కౌంటర్‌లో ఉన్న రూ. 14 వేల నగదును దుండగులు చోరీ చేశారని నిర్వాహకుడు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రాజేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. కాగా చోరీకి పాల్పడిన ఇద్దరు నిందితులు పోలీసుల అదుపులోనే ఉన్నట్లు సమాచారం.

మంగళ్‌పాడ్ జెడ్పీహెచ్ఎస్‌లో కంప్యూటర్..

బోధన్: ఎడపల్లి మండలంలోని మంగళ్‌పాడ్ జెడ్పీహెచ్ఎస్‌లో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాల గదిలోని కంప్యూటర్‌ను దొంగలించారని ఉపాధ్యాయులు బుధవారం తెలిపారు. కంప్యూటర్ విలువ రూ .60 వేల వరకు ఉంటుందన్నారు. గతేడాది పాఠశాలలోని రూ.20 వేల విలువ చేసే స్పోర్ట్స్ కిట్స్ దొంగతనం జరిగిందని పేర్కొన్నారు. చోరీ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

ఏర్గట్లలో చైన్‌స్నాచింగ్

మోర్తాడ్: ఏర్గట్ల మండల కేంద్రంలో చైన్‌స్నాచింగ్ ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఉప్లూర్‌కు చెందిన ఏనుగందుల జనార్దన్ పద్మ దంపతులు స్కూటీపై వెంచిర్యాలకు వెళ్తుండగా బైక్‌పై వచ్చిన ఆగంతకుడు ఏదో సమాచారం కోసం దంపతులను పలుకరించాడు. వారు సమాచారం చెప్పేందుకు వాహర వేగాన్ని తగ్గించగా సదరు వ్యక్తి పద్మ మెడలో ఉన్న 18 మాసాల పుస్తెలతాడును లాక్కొని పరారయ్యాడు. గమనించిన స్థానికులు చైన్‌స్నాచర్‌ను వెంబడిస్తూ జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం వరకు వెళ్లారు. అయినా జాడ దొరకలేదు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాము పేర్కొన్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

మోర్తాడ్: మండల కేంద్రంలోని మొండివాగులో చేపలు పట్టేందుకు వెళ్లి గల్లంతైన సురేష్ మృతదేహం బుధవారం లభ్యమైంది. సురేష్ వ్యవసాయ కూలీగా పనిచేస్తుండగా మొండివాగులో చేపలు పట్టేందుకు వెళ్లి మంగళవారం అందులో పడిపోయాడు. అతను ఆచూకీ ఎంతగాలించిన లభించలేదు. బుధవారం స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో వంతెన వద్ద మృతదేహం లభ్యమైంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విక్రమ్ పేర్కొన్నారు.

ఆస్తి ఇవ్వడం లేదని ఒకరి ఆత్మహత్య

నిజామాబాద్ రూరల్: తనకు రావాల్సిన ఆస్తిని ఇవ్వడం లేదనే మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో ఆరిఫ్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నాలుగో డివిజన్ మాధవనగర్‌కు చెందిన రాజారెడ్డి(37)కి ఇంట్లో ఆస్తి పంపకాల విషయంలో గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపానికి గురైన అతను బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య లాస్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

నిందితుడికి ఆరు నెలల జైలు శిక్ష

వర్ని(చందూర్): కారును అజాగ్రత్తగా నడిపి ఒకరికి మృతికి కారణమైన నిందితుడికి ఆరు నెలల జైలు శిక్ష, రూ. వెయ్యి జరిమానాను బోధన్ కోర్టు న్యాయమూర్తి సాయిశివ విధించారని ఎస్సై కృష్ణకుమార్ తెలిపారు. ఎస్సై బుధవారం తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్‌కు చెందిన శాఖమూరి బస్వపూర్ణ(60) అనే వృద్ధురాలు 2016నవంబర్27న చందూర్‌లోని బంధువుల ఇంటి వచ్చి బస్టాండ్‌కు వైపు నడుచుకుంటూ వెళ్తుండగా ఎడపల్లికి చెందిన పాముల అశోక్ కారులో వేగంగా వచ్చి ఢీకొన్నాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ ఆమె మృతి చెందింది. మృతురాలి కుమారుడు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. సాక్షాల్యను పరిశీలించిన జడ్జి నిందితుడికి ఆరు నెలల జైలు విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వన్యప్రాణుల వేటగాళ్ల అరెస్ట్

మాచారెడ్డి: మండలంలోని తడకపల్లి శివారులో ఇద్దరు వన్యప్రాణుల వేటగాళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్సై అనిల్ బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. అటవీ శాఖ సెక్షన్ అధికారి ఎంఏ ఫారూఖ్ పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు టీవీఎస్ ఎక్సెల్పై అనుమానాస్పదంగా కనిపించడంతో వారి వద్ద చనిపోయిన అడవి పంది, దానిని చంపడానికి ఉపయోగించిన తాడు ఉన్నాయి. అనంతరం వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

రుద్రూర్: మండల కేంద్రంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. వర్ని నుంచి వస్తున్న కారు, ట్రాలీ ఆటో ఢీకొన్నట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో ట్రాలీ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రాంపూర్‌లో మరొకరికి..

నవీపేట: మండలంలోని రాంపూర్ సమీపంలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. రెంజల్ మండలంలోని బాగేపల్లికి చెందిన పోశెట్టి తన స్నేహితునితో కలిసి నవీపేటకు వచ్చి తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో బైక్ వీరిని ఢీకొనడంతో పోశెట్టి కాలు విరిగింది. ఈ విషయమై పోలీసులను వివరాలు కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

దుకాణాలపై దాడులు

నవీపేట: మండల కేంద్రంలోని పలు దుకాణాలపై తూనికలు, కొలతల శాఖ జిల్లా అధికారి మహమ్మద్ సుజత్ అలీ బుధవారం దాడులు చేశారు. కొన్ని ఉత్పత్తులపై సంపూర్ణ సమాచారం లేకపోవడంతో ముగ్గురు వ్యాపారులపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. దాడిలో సిబ్బంది రవీందర్, సురేందర్, రాజలింగం పాల్గొన్నారు.